ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 25 ఆగస్టు 2024



పశుగణనకు సన్నద్ధం

- జిల్లాలో 255 గ్రామపంచాయతీల పరిధిలో 1వ తేదీ నుంచి సర్వే
- 51 మంది ఇమ్యూనైరేటర్లు, 8 మంది సూపర్‌వైజర్ల నియామకం
- తేలనున్న గొర్రెల లెక్కలు
- ఐదేళ్లకు ఒకసారి లెక్కింపు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మనుషులకు పశు సంపదకు మధ్య అనేక అనుబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగం, పాడి రంగంలో మనుషుల జీవనంతో ముడిపడి ఉంది. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణన సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 255 గ్రామ పంచాయతీల పరిధిలో 16 రకాల పశుజాతుల వివరాలను సేకరించనున్నారు. సర్వే కోసం 51 మంది ఇమ్యూనైరేటర్లు, ఎనిమిది మంది సూపర్‌వైజర్‌లను నియమించారు. 2019 తరువాత జరుగుతున్న పశుగణనలో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, గేదే జాతి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, పెంపుడు కుక్కలు, డెయిరీ ఫారాలు, కోళ్ల ఫాంలను లెక్కించనున్నారు. ఇందుకోసం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణను కూడా రూపొందించారు.

జిల్లాలో 2019 పశుగణన లెక్కలు...

మండలం	పశువులు	కుక్కలు	పౌల్ట్రీ
రుద్రంగి	8,626	14	3,133
చందుర్తి	27,470	163	70,167
వేములవాడ రూరల్	19,165	71	18,858
బోయినపల్లి	46,065	25	1,04,094
వేములవాడ	33,446	107	27,567
సిరిసిల్ల	20,777	137	68,086
కోనరావుపేట	81,809	313	21,075
వీర్నపల్లి	39,116	153	3,929
ఎల్లారెడ్డిపేట	74,424	217	21,001
గంభీరావుపేట	61,276	43	68,998
ముస్తాబాద్	51,116	198	1,58,854
తంగళ్లపల్లి	43,818	31	17,821
ఇల్లంతకుంట	88,655	795	26,386
మొత్తం	**5,95,763**	**2,267**	**6,09,969**

2019 పశు గణన లెక్కలతో పోలిస్తే ప్రస్తుతం పశువుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లుగానే భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గొల్ల కుర్మలకు అందించిన గొర్రెల యూనిట్లు పక్కదారి పట్టినట్లుగా భావించి సర్వే కూడా చేశారు. ప్రస్తుత పశుగణనలో వీటి లెక్కలు కూడా తీయనున్నారు. 2019 పశుగణన ప్రకారం జిల్లాలో వివిధ రకాల పశువులు, ఇతర జాతులకు సంబంధించి ఐదు లక్షల 95 వేల 763 ఉన్నాయి. తెల్ల పశువులు 43,818, నల్ల పశువులు 73,422, గొర్రెలు 4,03,725, మేకలు 72,225, పందులు 2,531, గుర్రాలు 40, కుక్కలు 2,267 ఇతర పశు సంపద 2,288 ఉన్నాయి. వీటితో పాటు 6,09,969 కోళ్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన పూర్తి లెక్కలు సంబంధించిన సర్వే చేయనున్నారు.

● తేలనున్న గొర్రెల లెక్కలు...

జిల్లాలో గొల్ల కుర్మలకు ఆర్థిక చేయూత అందించే దిశగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం లబ్ధిదారుల్లో నిరాశ మిగిల్చిగా పథకం పక్కదారి పట్టిందనే విమర్శలు వచ్చాయి. ఈ పథకంలో రెండు విడతలుగా లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించడానికి నిర్ణయించినా రెండో విడతలో అనేక అడ్డంకులతో పథకం నిలిచిపో యింది. చివరకు లబ్ధిదారులు కట్టిన వాటా దనం డబ్బులు తిరిగి ఇచ్చివేశారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలోని 190 గొర్రెల సహాహకార సంఘాల్లోని సభ్యుల్లో రెండు విడతలుగా డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో రెండు విడతలకు సంబంధించి 16,170 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటి వరకు 11,542 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించారు. జిల్లాలో మొదటి విడతలో 8,137 యూనిట్ల లక్ష్యానికిగానూ 7,517 యూనిట్లను పంపిణీ చేశారు. రెండో విడతలో 8,033 యూనిట్ల పంపిణీ లక్ష్యం కాగా 4017 యూనిట్లను పంపిణీ చేశారు. వాటాధనం చెల్లించిన వారికి తిరిగి ఇచ్చివేశారు. మొదటి విడత గొర్రెల పంపిణీలో అనేక అవకతవకలు వెలుగు చూశాయి. కడప జిల్లా నుంచి గొర్రెలను తీసుకరావడం మళ్లీ గొర్రెలను ఆంధ్రాకు పంపించడంతో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆంధ్రా తెలంగాణల మధ్య గొర్రెలు చక్కర్లు కొట్టాయి. అనేక సందర్భాల్లో గొర్రెలను పట్టుకోవడంతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారితో పాటు మండల అధికారి కూడా సస్పెన్షన్‌కు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. దానిని దృష్టిలో పెట్టుకొని రెండో విడతలో పకడ్బందీగా పంపిణీ చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు కూడా తీసుకున్నారు. పంపిణీ చేసిన గొర్రెలు కూడా తగ్గిపోయినట్లుగా భావిస్తున్నారు. ప్రస్తుతం పశుగణనలో గొర్రెల లెక్కలు బయటికి వస్తాయని భావిస్తున్నారు.





ఆర్‌వోఆర్ చట్టంపై సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 24: ప్రభుత్వం తీసుకువచ్చే నూతన ఆర్‌వోఆర్ చట్టం 2024 ముసాయిదాపై చర్చ వేదికలో రైతులతోపాటు ప్రతీ ఒక్కరు ఇచ్చిన సలహాలు, సూచనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వెల్లడించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం నూతన ఆర్‌వోఆర్ చట్టం 2024 ముసాయిదాపై రైతులు, రైతు సంఘాల నాయకుల, ప్రముఖులతో చర్చా వేదికను నిర్వహించి చట్టంపై సిరిసిల్ల ఆర్డీవో రమేష్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చర్చా వేదికలో పలువురు మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జిల్లాలో రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేయాలని , ప్రతి గ్రామానికి వీఆర్‌వో, వీఆర్‌ఏలను నియమించాలన్నారు. ప్రతీ ఏడాది భూమికి సంబంధించి కనీస రుసుం వసూలు చేయాలని, ప్రతీ సంవత్సరం పహాణీ తయారు చేయాలని సూచించారు. గ్రామంలో ప్రభుత్వ భూముల వివరాలు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉండేలా చూడాలని అన్ని భూములను రీసర్వేలు చేయాలన్నారు. ధరణిలో ఎదురైనా సమస్యలను పరిష్కరించాలని, ప్రొహిబిటెడ్ భూముల విషయంలో నిర్ణయం తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చెప్పిన సలహాలు, సూచనలపై ఒక నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టంపై ముగ్గురు నిపుణులతో కమిటీ వేసిందన్నారు. దాదాపు 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ఆరు నెలల్లో ముసాయిదాను తయారు చేసిందని తెలిపారు. భూసమస్యలు రాకూదనే ఉద్దేశంతో చట్టాన్ని ఏర్పాటు చేయనుందన్నారు. దీనిపై ఇప్పటికే ఆన్‌లైన్‌లో సూచనలు, సలహాలను స్వీకరించిందని వివరించారు. చట్టం అందరికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఇప్పుడు నేరుగా స్వీకరించేందుకు చర్చా వేదిక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు

- ఎస్పీ అఖిల్ మహాజన్



రివార్డు అందుకున్న సిబ్బందితో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 24: శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు వస్తుందని, నేరం చేసిన వారికి శిక్ష తప్పదనే భయం కలిగిస్తే నేరాలు అదుపులోకి వస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించిన అంశాలు, సమన్స్, వారెంట్‌లపై కోర్టులలో ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యేవరకు కోర్టు కానిస్టేబుల్ నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, సాక్షుల వాంగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని, కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. కేసు ట్రయల్స్ సమయంలో పీపీ(పబ్లిక్ ప్రాసిక్యూటర్స్)ల సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు. కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసిన అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఇటీవల మూడు కేసుల్లో ఎనిమిది మందికి శిక్షలు పడటంలో కృషిచేసిన రుద్రంగి ఎస్ఐ అశోక్, కోర్టు కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నరేశ్, మధుసూదన్, రైటర్స్ రాజేంద్రప్రసాద్, ప్రసాద్‌ను అభినందించి ప్రశంసాపత్రాలు, రివార్డులు ఎస్పీ అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రౌడీ షీటర్స్ నేర ప్రవర్తన మార్చుకోవాలి

- ఎస్సై రాజశేఖర్‌రెడ్డి

కోనరావుపేట ఆగస్టు 24: రౌడీషీటర్స్ నేర ప్రవర్తనను మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి అన్నారు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్స్‌కు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి జీవన విధానాలతో పాటు ప్రస్తుతం వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నవారు మంచి ప్రవర్తనతో కలిగి ఉండాలన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగించవద్దని సూచించారు. ప్రతీ ఐదు నెలలకు ఒకసారి చెడు ప్రవర్తన కలిగిన వారిని బైండోవర్ చేస్తామని అన్నారు. వారిపై పోలీస్ నిఘా ఉంటుందని అన్నారు. రౌడీ షీటర్లు తన నేర చరిత్రను మాని అందరితో కలిసి ఉండాలని అన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లైంగిక నేరాలపై అవగాహన సమావేశం

ఇల్లంతకుంట, ఆగస్టు 24: మండలంలోని గాలిపెల్లి, పొత్తూరు, వల్లంపట్ల, ఇల్లంతకుంటలోని కస్తూరిభా పాఠశాలలో లైంగిక వేధింపులపై విద్యార్థులకు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ శనివారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు బాలికలు వేధింపులకు గురయితే 100కు డయల్ చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలలో ఉపాధ్యాయులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మొగిలి

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఇల్లంతకుంట, ఆగస్టు 24: మండలంలోని కందికట్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘ మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ ఆదివారం జరుగుతుందని తెలిపారు. అన్ని గ్రామాల నాయకులు, అభిమానులు హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పసుల వెంకటి, రాజేశం, దాసు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి రహిత సమాజానికి కృషి

- అడిషనల్ ఎస్పీ చంద్రయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 24: డ్రగ్స్, గంజాయి రహిత సమాజానికి అందరం కలిసి కృషి చేద్దామని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. కలెక్టరేట్ సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని శనివారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతో పాటు కళాశాలలు, పాఠశాలలలో అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం లైన్ డిపార్ట్‌మెంట్‌లు అన్నీ ఒకటిగా కలిసి పనిచేయాలని తెలిపారు. ప్రతీ స్కూల్, కాలేజీల్లో మత్తు పదార్థాల నిర్మూలనకు కమిటీలను కొనసాగిస్తూ, విద్యార్థులకు అన్ని రకాల మాదక ద్రావ్యల దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు వలంటీర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేయాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల మండల జిల్లా స్థాయిలో విద్యార్థులకు డ్రగ్స్ వ్యతిరేకతపై వ్యాసరచన, డిబేట్, పోటీలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఈవో రమేష్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్, డీఏవో అఫ్జల్ బేగం, సిరిసిల్ల ఎఫ్‌ఆర్‌వో కల్పన దేవి అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే 'ఇందిరా మహిళా శక్తి'



కోళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని ప్రవేశపెట్టి రుణాలను అందిస్తోందని డీఆర్‌డీవో శేషాద్రి తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి గ్రామాల్లో 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద చేపట్టిన పెరటి కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తుల పదార్థాల విక్రయ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శేషాద్రి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఇందిరా మహిళాశక్తి పథకం కింద మహిళలకు రుణాలను అందిస్తున్నామని అన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎం పద్మయ్య, ఏపీఎం మల్లేశం, సీసీ మంగ్యానాయక్ పాల్గొన్నారు.

వస్త్రపరిశ్రమకు విద్యుత్ సబ్సిడీని అందించాలి

- సెస్ కార్యాలయం ఎదుట ఆసాముల ధర్నా

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీని అందించడంతో పాటు నాలుగో కేటగిరి పరిధిలోకి తీసుకోవాలంటూ సెస్ కార్యాలయం ఎదుట ఆసాములు శనివారం ధర్నా చేశారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీని అందించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సెస్ పాలకవర్గంతోపాటు అధికారులకు సూచించినా వారు వినిపించుకోకుండా సబ్సిడీని కేవలం ఒక్క మీటర్‌కు 10 హెచ్‌పీల వరకు అందిస్తామని తెలిపారన్నారు. మిగితా మీటర్లకు ఎనిమిది రూపాయల చొప్పున బిల్లులు వేస్తున్నారని దీనిపై శనివారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతోపాటు ఎండీ శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి మాట్లాడామన్నారు. కేవలం 10 హెచ్‌పీల వరకే సబ్సిడీ వర్తిస్తుందని ఇంకా కావాలంటే ప్రభుత్వం నుంచి తెచ్చుకోవాలని తెలిపారన్నారు. దీంతో ఆగ్రహించిన ఆసాములు సెస్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆసాములు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ చెప్పినా కూడా సెస్ పాలకవర్గంతోపాటు, అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వస్త్ర పరిశ్రమలను నాలుగో కేటగిరి పరిధిలోకి తీసుకోని 25 హెచ్‌పీల వరకు విద్యుత్ సబ్సిడీని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసాములు సిరిసిల్ల రవీందర్, చేరాల అశోక్, పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆసాములు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, ఆగస్టు 24: శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెంకు చెందిన చల్ల కనకయ్య (58) శుక్రవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపైన వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడి ఉన్న కనకయ్యను చూసిన స్థానికులు మృతుడి భార్య మధనవ్వకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు కనకయ్యను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కనకయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

ఆధునిక కాలంలో జంతుశాస్త్ర పురోగతి అవసరం



ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్

జమ్మికుంట, ఆగస్టు 24: ఆధునిక కాలంలో జంతుశాస్త్ర పురోగతి ఎంతో అవసరం ఉందని ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జంతుశాస్త్రంలో ఇటీవలి పురోగతులు అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మట్లాడుతూ మానవ మనుగడపై విద్యార్థులు జంతుశాస్త్ర అభివృద్ధికి వినూత్నమైన పరిశోధనలు చేయాలని సూచించారు. మానవళి అభ్యున్నతి జంతుశాస్త్ర పురోగతితో ముడిపడి ఉందన్నారు. ఆధునిక కాలంలో రోజు రోజుకు పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి కారకాలు, వాటి నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రిన్సిపాల్ బి రమేశ్‌ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేశ్, జంతుశాస్త్ర విభాగాధిపతి కె గణేశ్, కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే రాజేంద్రం, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఓదేలు కుమార్, జంతుశాస్త్ర అధ్యాపకులు మమత, రమేశ్, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సైదాపూర్, ఆగస్టు 24: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామ స్టేజీ వద్ద ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్న దిరావత్ పాండు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, ట్రాలీని సీజ్ చేశామని తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


నృసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు

నృసింహుడి సన్నిధిలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 24: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు శ్రావణ మాసం మూడవ శనివారం భక్తులతో రద్దీగా అగుపించాయి. ఉద యం వేళలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితక వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందిం చారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తు_లకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహర నాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతరఅధికారులు పర్యవేక్షించారు. ఆంజనేయస్వామిని జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.


కొండగట్టులో పూజలు చేస్తున్న భక్తులు

అవినీతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలన

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ముస్తాబాద్, ఆగస్టు 24: అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చేలా పాలన కొనసాగిస్తోందన్నారు. గతంలో అవినీతి అక్రమాలతో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి అస్తవ్యస్తంగా పనులు చేయడంతో అర్థాంతరంగా నిలిచిపోయాయన్నారు.. గతంలో పనులు చేతకాక కేటీఆర్, హరీష్‌రావు అవినీతి అక్రమాలకు పాల్పడ్డార న్నారు. ఇప్పుడు పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కుటుంబ పాలనతో ప్రజలను ఎన్నో ఇబ్బం దులకు గురిచేశారన్నారు. దీంతో ప్రజలే ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఓవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాళేశ్వరం ప్రాజెక్టుకు వెళ్లడం ఒక డ్రామా అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు మతి లేని మాటలు మాట్లాడడం ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులకు అడ్డం పడుతూ సమయాన్ని వృధా చేయడం బీఆర్ఎస్ మానుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలను ప్రభు త్వానికి విన్నవించడం గౌరవప్రదమని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు తాళ్ల విజయ్ రెడ్డి, దీటి నర్సింలు, ముచ్చర్ల శ్రీనివాస్, తలారి నర్సింలు, భాను, గంత రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

రాజన్న ఆలయంలోని వివిధ విభాగాల్లో అవకతవకలు

- రెండు రోజుల పాటు ఏసీబీ అధికారుల తనిఖీలు - ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పలు విభాగాల్లో అవకతవకలు బయటపడ్డాయి. రెం డు రోజులపాటు ఆలయంలోని పలు విభాగాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన ఏసీబీ అధికారులు పలు అవకతవకలు గుర్తించి ఉన్నత స్థాయి అధికా రులకు శనివారం నివేదికను అందించారు. ఏసీబీ తెలంగాణ పేరుతో అధికారులు ఎక్స్‌లో అవకతవకలతో కూడిన పోస్టును విడుదల చేశారు. రాజన్న ఆలయంలోని లడ్డూల త యారీ విభాగంలోని స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు ఉండటం గుర్తించారు. నెయ్యి, జీడిపప్పు, నూనే సంబంధిత వాటిలో తేడాలు బయటపడ్డాయి. తలనీలాలు సమర్పించడం కోసం వచ్చే భక్తుల నుంచి కల్యాణకట్ట వద్ద రూ. 50 నుంచి రూ. 100 వసూలు చేయడం, నూతన టెండర్లకు కమిషనర్, దేవాదాయ శాఖ ఆమోదం లేకుండానే పాత టెండర్ల ప్రకారం వస్తువులను కొనుగోలు చేయడం వంటి అవకతవకలు బయటపడ్డాయి.

● ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం, శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు రోజులపాటు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు విభాగాల్లోని ఫైళ్లను సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏసీబీ అధికారులు పలు విభాగాల్లో అవకతవకలు ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. దీంతో సంబంధిత విభాగాల ఉద్యోగులు ఇరుక్కున్నామని భయాందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.


Post
ACB Telangana
@TelanganaACB
#ACBOfficials conducted Surprise Check at Sri Raja Rajeshwara Temple, Vemulawada of Rajanna Sircilla District and the EO Office on 22.08.2024. (Yesterday)

The following irregularities were identified.

1) Variations in the stock register (related to Ghee, Cashew nut and Oil)

2) Collecting Rs.50/- / 100/- per rach pilgrim for head tonsuring at Kalyanakatta.

3) Without approval of tenders by the Commissioner, Endowment dept for the process of items (Maximum) purchasing. But they are following old tenders.
#AntiCorruptionBureau #Telanagana #Justice @CVAnandIPS

ఏసీబీ తెలంగాణ పేజీలో
వైరల్‌గా మారిన అవకతవకల పోస్ట్

సౌదీలో యువకుడి మృతి

- కరీంనగర్‌లో విషాదం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదా ఖాన్(27) సౌదీ అరేబి యాలో నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు సమాచారం అందడంతో మృతుడి ఇంట విషాదం నెలకొంది. కరీంన గర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదాఖాన్ ఏడు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడ ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాదికి ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేవాడు. ఆదర్శనగర్‌కు చెందిన షహెదాఖాన్ తండ్రి స్వస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, తల్లిది కరీంనగర్. షహెదాఖాన్ కరీంనగర్‌కు చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారికి రెండు సంవత్సరాలు, 8 నెలల ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందటే షహెదాఖాన్ కరీంనగర్‌కు వచ్చి కొన్నిరోజులు భార్యపిల్లలు, కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి సౌదీ అరేబియాకు వెళ్లాడు. షహెదాఖాన్ మరణించాడని తెలిసిందని, కానీ సౌదీ అరేబియా నుంచి అధికారికంగా పూర్తి సమాచారం అందలేదని మృతుడి బంధువులు వెల్లడించారు. సౌదీఅరేబియాలో శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవుదినాలు కావడంతో మృతదేహం పంచనామా, పోస్టుమార్టం పూర్తి అయి స్వదేశానికి చేరేందుకు వారం పది రోజులు పట్టే అవకాశముందని మృతుడి బంధువులు తెలిపారు.


షహెదా ఖాన్(ఫైల్)

రేషన్ బియ్యం పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 24: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి శనివారం పట్టుకున్నారు. డీటీ శ్రీని వాస్, పౌరసరఫరాల శాఖ ఇన్స్‌పెక్టర్ స్వామి ఆధ్వర్యంలో పక్కా సమాచారం మేరకు గ్రామంలో పస్తం కనకయ్యకు చెం దిన షెడ్డులో అధికారులు సోదాలు చేయగా 11 క్వింటాళ్ల విలువైన 20 బస్తాల పీడీ ఎస్ రైస్ పట్టుబడింది. వాటిని స్వాధీనం చేసుకుని గోదాంకు తరలించారు. కనకయ్యను అదుపులోకి తీసుకుని, అతడి పై సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీణవంక: మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండుగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. సుల్తానాబాద్‌కు చెందిన బోనగిరి సురేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ బలవన్మరణం

గొల్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో శనివారం తీరని విషాధం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం నెలల తక్కువతో జన్మించిన తన చిన్నారికి మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పొన్నం వెంకటేష్ (28) అనే నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గ్రామంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. వెంకటేష్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరగగా రెండు నెలల క్రితం ఓ ఆడ శిశువు జన్మించింది. చిన్నారి పుట్టిన నాటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడతో ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికే చిన్నారి వైద్య ఖర్చుల కోసం బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు చేసి సుమారు రూ. 4 లక్షల మేర వెచ్చించారు. అయినా చిన్నారి జబ్బు నయం కాకపోగా మరింత ముది రింది. దీనికి వైద్యులు చిన్నారి ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే మెరుగైన వైద్యం చేయించాలని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వెంకటేష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బిడ్డకు మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

మహిళలకు లోన్‌యాప్ వేధింపులు

గంగాధర, ఆగస్టు 24: మండలంలో పలువురి మహిళలకు లోన్‌యాప్ సిబ్బంది ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారు. తాను లోన్ తీసుకోకున్న ఆన్‌లైన్‌లో రుణం పొందిన వ్యక్తికి సాక్షి సంతకం చేయగా రుణం తిరిగి చెల్లంచక పోవడంతో సాక్షి సంతకం చేసిన వ్యక్తి మహిళ బంధువులతో పాటు ఆ గ్రామ మహిళా మాజీ సర్పంచ్ భర్తను లోన్‌యాప్ సిబ్బంది అసభ్య కరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువకుడు ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌లో రుణం తీసుకున్నాడు. రుణం తీసుకున్న స్నేహితుడికి గంగాధర మండలంలోని యువకుడు ఆన్‌లైన్‌లో సాక్షి సంతకంతో పాటు ఫోన్ నంబర్ జతచేశాడు. రుణం తీసుకున్న యువకుడు సకాలంలో చెల్లించలేదు. దీంతో సాక్షి సంతకం పెట్టిన మండలంలోని యువకుడి మొబైల్‌లోని కాంటాక్టు నంబర్లను సేకరించి మహిళలకు సంస్థ నుంచి పలుమార్లు ఫోన్ చేసి వేధింపులకు గురి చేశారు. సదరు వ్యక్తి తమకు తెలియదని సమాధానం చెప్పినా రుణం ఇచ్చిన వారు అసభ్యకరంగా మహిళ భర్తతో పాటు మరో పది మంది మహిళలతో మాట్లాడినట్లు తెలిపారు.

అదుపుతప్పి పొలంలో పడ్డ కారు

- మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లే రహదారి లో శనివారం ఉదయం కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. శనివారం ఉదయం కారులో కరీంనగర్ నుంచి జగిత్యాల మీదుగా కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు కారులో ఐదుగురు ఉపాధ్యాయులు వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారి బురదమయమై పూర్తిగా దెబ్బతింది. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లే రహదారి మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లడంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. పొలంలో పడ్డకారును ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి బయటకు తీశారు.

పెద్దపల్లి లైబ్రరీకి పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల కోసం పోటీ పడే నిరుద్యోగ యువతీ యువకుల కోసం కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను కరీంనగర్‌లోని బీఎన్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎన్‌రావు లైబ్రరీకి అందజేశారు. శనివారం పెద్దపల్లి లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్కిల్స్ కొరత కారణంగా దేశంలో పదకొండు కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు స్థాపిస్తే అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన పెరుగుతుం దన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఎన్‌రావు ఎప్పటినుంచో పేదలకు ఉచిత వైద్య సేవలం దిస్తున్నారన్నారు. గత సంవత్సరం నుంచి విద్యాపరంగా నాలుగు జిల్లాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకి ఇస్తున్నారు తెలిపారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫణిందర్, అడ్వకేట్ ఆడెపు దినేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ బీఎన్ రావు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెరిగిన వరద

- కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతున్నది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 16,564 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 6,530 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడడంతో వరద నీరు ఎక్కువగా వస్తున్నది. ప్రాజెక్టు నిండడంతో గేట్లు ఎత్తి గోదావరిలోకి వదులుతున్నారు. ఆ నీరంతా శ్రీపాద ఎల్లంపల్లికి చేరుతున్నది. మరింత వరద పెరిగితే మాత్రం నంది పంప్‌హౌస్‌లో మరో రెండు మోటార్లు ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని భావిస్తున్నామని నీటి పారుదల శాఖాధికారులు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.529 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం రెండు పంపుల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18.5 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఎల్ఎండీకి నీటి విడుదల ప్రారంభం

బోయినపల్లి, ఆగస్టు 24: మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఎల్ఎండీలోకి నీటి విడుదలను శనివారం ప్రారంభించారు. మిడ్ మానేరులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300, ములవాగు మానేరు వాగు ద్వారా 700 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.99 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.33 టీఎంసీల మేరకు చేరుకొంది. కాగా ఎల్ఎండీ ప్రాజెక్టుకు రెండు వేల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రాంభించారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎస్సారెస్పీలోకి 29,443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.659 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అసరాలకు ప్రాజెక్టు నుంచి 3,822 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంతరాలయ దర్శన టికెట్ల పునరుద్ధరణ


అంజన్న ఆలయం

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొన్నాళ్ల క్రితం కొవిడ్-19 నేపథ్యంలో నిలిచిపోయిన అంతరాలయ దర్శన టికెట్లను పునరుద్ధరిస్తున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొవిడ్‌కు ముందు రూ.400 టికెట్ అంతరాలయ దర్శనంలో భాగంగా సంప్రదాయ దుస్తులతో అయిదుగురికి దర్శనం కల్పించగా కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మార్చి 2020 నుంచి అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు. శనివారం నుంచి మళ్లీ యదావిధిగా రూ.400టికెట్‌తో అంతరాలయ దర్శనాలు పునరుద్ధరించినట్లు భక్తులు సహకరించాలని ఈవో పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

- ఉన్నత ఉద్యోగం సాధించినా రిలీవ్ చేయడం లేదని ఆవేదన - మండలపరిషత్ కార్యాలయంలోనే ఘటన


చికిత్సపొందుతున్న శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఆగస్టు 24: ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించినా మండలపరిషత్ అధికారులు రిలీవ్ చేయడం లేదంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి పంచాయతీ కార్యదర్శుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలం పర్దీన్‌పూర్ గ్రామానికి శ్రీనివాస్ నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యాడు. ఇల్లంతకుంటలో తోటి పంచాయతీ కార్యదర్శులతో ఉంటూ శ్రీనివాస్ పోటీపరీక్షలకు సిద్ధం అవుతూనే విధులు నిర్వహించే వాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో మెదక్ మున్సిపాలిటీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 31లోపు విధుల్లో చేరవలసి ఉంది. తనను పంచాయతీ కార్యదర్శి నుంచి రిలీవ్ చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఆలస్యం జరుగుతుండటంతో శనివారం మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవోకు సమస్యను విన్నవించాడు. వెంటనే పక్కన ఉన్న గదిలోకి వెళ్లి వెంటతెచ్చుకున్న క్రిమిసంహారక మందుతాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికత్స జరిపి ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తొమ్మిది ఉద్యోగాలు సాధించాడని గతంలో ఇదే మండలపరిషత్ కార్యాలయంలో సన్మానం పొందిన శ్రీనివాస్‌ను అపస్మారకస్థితిలో తరలించడాన్ని మండలపరిషత్ సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనపై ఎంపీడీవో శశికళను వివరణ కోరగా రెండు రోజుల క్రితమే తమకు లేఖ అందిందని, ఎంపీవో నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని సూచించానని తెలిపారు. తొందరపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తాము ఎక్కడా ఆలస్యం చేయలేదని వివరించారు.

- అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: విధుల్లో పట్ల అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగికి మరో ఉద్యోగం రావడంతో రిలీవ్ చేయడంలో మానసికంగా వేధింపులకు పాల్పడిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో మనస్తాపానికి గురై ఇల్లంతకుంట మండల పరిషత్తు కార్యాలయంలో పురుగుల మందు తాగిన కిష్టరావుపల్లి పంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం వారు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శిగా పనులు చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించిన శ్రీనివాస్‌ను మండల పరిషత్ అధికారులు విధుల నుంచి రిలీవ్ చేయకపోవడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వేధింపులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబంలో జన్మించిన శ్రీనివాస్ ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత ఉద్యోగం సాధిస్తే రిలీవ్ చేయాల్సిన అధికారులు ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్ అన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, 24 :ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో సట్టంశెట్టి రజని (39) అనే వివాహిత శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోరుట్ల రూరల్, ఆగస్టు 24 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి కో రుట్ల పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ కిషన్ శనివారం తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాలలో రెవెన్యూ అధికారులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఆర్ఐ రాజేందర్‌రావు ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల నుంచి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 22 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 15 మందికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: మద్యం సేవించి వాహనాలు నడపుతూ ఇటీవల కరీంనగర్‌లో పట్టుబడిన 15మంది వాహనదారులకు కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 70మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ఐదుగురికి 7 రోజులు, 10 మందికి 3 రోజులు జైలు శిక్ష, మొత్తం 34 వేల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. మిగతా 55మందికి 90 వేల 500 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 223 వాహనదారులకు జైలు శిక్షలు పడ్డాయని సీఐ తెలిపారు.

రాజన్న సేవలో బీసీ కమిషన్ సభ్యుడు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్‌గౌడ్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్ ప్రసాదం అందజేశారు.


స్వాగతం పలుకుతున్న సూపరింటెండెంట్ తిరుపతిరావు

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ కోర్టు సమీపంలోని వాటర్‌ట్యాంక్ పక్కన గుర్తుతెలియని వృద్ధురాలు(65) మృతిచెందిందని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి 9గంటల సమయంలో వృద్ధు రాలు పడిపోయి ఉండగా గుర్తించిన పోలీసులు ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీ గదికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. వృద్ధురాలిని గుర్తించి నవారు రెండో ఠాణా పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన బోయిని సదానందం (45)పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంటి బయట పురుగుల మందు తాగగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. సదా నందం సిరిసిల్ల మార్కెట్‌లో రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి విక్రయించేవాడు. పది రోజులుగా మార్కెట్‌కు సైతం వెళ్లడం లేదని బంధువులు చెప్తు న్నారు. ప్రస్తుతం సదానందం పరిస్థితి విషమంగా ఉంది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ మృతి

కోనరావుపేట ఆగస్టు 24: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టగా సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవనగర్‌కు చెందిన ఆర్ వెంకట్రాజం (63) అనే వ్యక్తి గతంలో లైన్‌మెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం కోనరావుపేట మండల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా ధర్మారం గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో కింద పడిపోయిన వెంకట్రాజముకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రి తరలించారు. అసుపత్రిలో శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు


ధర్మారంలో బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

అడవుల ప్రాధాన్యంపై అవగాహన

వీర్నపల్లి, ఆగస్టు 24: అడవుల ప్రాధాన్యంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అటవీ శాఖ సెక్షన్ అధికారి రంజిత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు అడవుల ప్రాధాన్యాన్ని తెలుసుకునేందుకు అటవీశాఖ కార్యాలయంలోని నర్సరీని క్షేత్రస్థాయిలో శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అటవీశాఖ బీట్ అధికారి కిరణ్ కుమార్ విద్యార్థులకు అడవుల సంరక్షణ వాటి ఉపయోగంపై వివరించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలను విద్యార్థులకు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణను ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో బాగస్వాములు కావాలన్నారు. ప్రతిఒక్కరూ ఒక్కో మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ సంధ్యారాణి, సోషల్ ఉపాధ్యాయుడు నరేష్ కుమార్, పీడి ప్రతాప్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



భూక్యాతండాలో చెక్కును అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, జబ్బర్, శ్రీశైలం, ఎల్లయ్య, దాసు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని భూక్యతండా గ్రామంలో గుగులోతు సక్కు అనే లబ్ధిదారుకు మంజూరైన రూ. 33 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం నాయకులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోతు భారతి, టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీరాం నాయక్, మాజీ ఏఎంసి వైస్ ఛైర్మన్ తులసి రామ్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

చేనేత సెల్ కార్యనిర్వాహక పట్టణ అధ్యక్షుడిగా అశోక్



నియామక పత్రాన్ని అందిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24: సిరిసిల్ల పట్టణానికి చెందిన బండారి అశోక్‌ను కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం సిరిసిల్ల పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ చేనేత జిల్లా అధ్యక్షుడు గోనే ఎల్లప్ప ఉత్తర్వులను జారీ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి నియామక పత్రాన్ని అశోక్‌కు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, నాయకులు కమలాకర్ రావు నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్ గుండ్లపల్లి గౌతం పాల్గొన్నారు.

నియామకం



నరసయ్య

సిరిసిల్ల టౌన్ ఆగస్టు 24: జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన జజ్జరి నరసయ్యను జాతీయ కాంగ్రెస్ వారియర్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ శనివారం జాతీయ కాంగ్రెస్ వారియర్స్ అధ్యక్షుడు కుల్దీపక్ జోషి, దక్షిణ భారతదేశ ఇన్‌చార్జి లక్ష్మీ నారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చిన జాతీయ రాష్ట్ర నాయకులకు, రాష్ట్ర మంత్రులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజన్న భక్తుల మనోభావాలను కాపాడాలి



ఏఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి భక్తుల మనోభావాలను కాపాడాలని వీహెచ్‌పీ నాయకులు ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. స్వామి వారికి నిత్యం నివేదన సమయంలో అందించే నైవేద్యం ఉడకనిది సమర్పించారని దానికి సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గడప కిషోర్‌రావు, నాగుల రాముగౌడ్, గౌరిశెట్టి శ్రీనివాస్, నవీన్, అజయ్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ సందర్శన

రుద్రంగి(చందుర్తి)ఆగస్టు 24: రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను శనివారం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఛైర్మన్ గాజుల వేణుకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని వంట గదిని పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట జనరల్ సెక్రెటరీ సామర్ల ప్రసాద్, వర్కింగ్ కమిటీ ఛైర్మన్ కుంటాల అంజయ్య ఉన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో నేడు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



మాట్లాడుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: సిరిసిల్ల పట్టణంలో ఇస్కాన్ అధ్వర్యంలో శ్రీకృష్ణామి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తామని, ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఇస్కాన్ నిర్వహకులు ప్రాణనాథ అచ్యుత దాస కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. పట్టణంలోని పద్మనాయక కళ్యాణమండపంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు అభిషేకం, 9 గంటలకు దర్శన హారతి, గురుపూజ, ప్రతీఒక్కరికి దర్శనం, హరినామ జపయజ్ఞం, 10 గంటలకు అన్నదాన సేవ, 11 గంటలకు రాజభోగ సమర్పణ, మధ్యాహ్నం 12 గంటలకు రాజభోగ హారతి, 12.30 గంటలకు దర్శనం, సాయంత్రం 4.15 గంటలకు దూప హారతి, ఆరు గంటలకు మహా అభిషేకం, 8.30 గంటలకు మహామంగళహారతి, మహీ సంకీర్తనం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి భక్తులందరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో అడెపు శ్రీహరి, కోడం అశోక్, గాజుల రవి, సిరిసిల్ల తిరుపతి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



చందుర్తి మండలం రామారావుపల్లెలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



సిరిసిల్ల నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలలో..



తంగళ్లపల్లిలో..



ఎల్లారెడ్డిపేటలో..

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలతోపాటు అర్బన్ పరిధిలోని పెద్దూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషదారణలో పాఠశాలకు హాజరై ఉట్టికొట్టారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు సింగారం, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్, నారాయణపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట తదితర గ్రామాల్లో విద్యార్థినీ, విద్యార్థులు గోపికలు, చిన్నికృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్, దాచారం, రేపాక, ఇల్లంతకుంటలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులు గోపికలు, కృష్ణుల వేషదారణతో ఆకట్టుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాణి, రవీందర్‌రెడ్డి, తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ముస్తాపనగర్ ప్రాథమిక పాఠశాలలో కృష్ణుడు, గోపికమ్మల వేషధారణతో చిన్నారులు ఉట్టి కొట్టడం అందర్నీ అలరించాయి. పాఠశాల హెచ్ఎంలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లిలో ఛత్రసేన యూత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఉట్టిని కొట్టారు. కార్యక్రమంలోయూత్ అధ్యక్షుడు బోనుగాని రంజిత్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ రేణుక, మాజీ సర్పంచ్ కొయ్యడ రమేష్, పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని జోగాపూర్, సనుగుల, రామారావుపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణ వేషాధారణతో పాటు గోపికల వేషాధారణల్లో నృత్యాలు చేస్తూ ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎలిగేటి శ్రీలత, ముఖేష్, శ్రీనివాస్, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు గడ్డం రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రంగి,(చందుర్తి): రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుని, గోపికల వేషదారణలో తరలి వచ్చి కోలాటం ఆడుతు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, కరస్పాండెంట్ ఎలిగెటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాథ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోయినిపల్లి: మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఉట్టి కొట్టించడంతో పాటు విద్యార్థులకు శ్రీకృష్ణుని జీవిత చరిత్రపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చందుర్తి మండలం జోగాపూర్‌లో..



రుద్రంగిలో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు



బోయినపల్లి మండలం విలాసాగర్‌లో..

హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్య వేదిక నాయకులు



వీర్నపల్లిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతోపాటు కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిని హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. నిరసన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీ చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఎవరు పట్టించుకోకపోవడం శోచనీయన్నారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మహిళా డాక్టర్‌కు రక్షణ లేకుండాపోయిందన్నారు. అక్కడి ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, భజరంగ్ దళ్ అధ్యక్షుడు బండారి సంతోష్, హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు కొండి సురేందర్, భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు గుంటుక పురుషోత్తం, బీజేపీ మహిళామోర్చా పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **నిందితులను ఉరితీయాలి..**

సిరిసిల్ల టౌన్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన అసలు నిందితులను గుర్తించి ఉరితీయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణం నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ కలకత్తా పట్టణంలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటన జరగడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అసలైన నిందితులందరిని ఇప్పటికీ గుర్తించక పోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. వైద్యురాలు కుటుంబానికి ప్రభుత్వాలు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా కఠిన చట్టాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేష్, నవీన్ తిరుపతి, సాయి, రోహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కోల్‌కతా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించి వైద్య విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. వైద్య విద్యార్థికి న్యాయం చేసే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడలో నేడు మెగా జాబ్‌మేళా

వేములవాడ టౌన్, ఆగస్టు 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు యువతకు అందిం చేందుకు వేములవాడ పట్టణంలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కు మార్ ఝా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో 50 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహి స్తున్నామని, ఉదయం 10 గంటలకు పట్టణంలో మహ లింగేశ్వర గార్డెన్‌లో 50 కంపెనీలతో 500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసిన అభ్యర్థులు మేళాలో పాల్గొనవ చ్చని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల ని రూ. 12 వేల నుంచి 40 వేల వరకు వేతనం ఉంటుం దని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల మాజీ సర్పంచ్ రామిండ్ల మోషయ్య(70) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మోషయ్య ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాదుకు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మోషయ్య సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామాభివృద్ధికి విశేష కృషిచేశారు. ఆయన మృతిపై స్థానిక నాయకులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని 25, 36, 37, 38 వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండాలను మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడారు. హైడ్రాతో కేటీఆర్‌కు వణుకుపుడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అన్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రశంసలను ఓర్వలేక కేటీఆర్, హరీష్‌రావు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో బడుగు బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని నాటి బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే బర్లు, గొర్రెలు, ట్రాక్టర్లు, రుణమాఫీ, సంక్షేమ పథకాలు అందించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అర్హులైన ప్రజలకే పథకాలను అందిస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కలలో ఉన్న ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో చెరువులను, కుంటలను ఆక్రమించుకున్న అవినీతి తిమింగాలాల బాగోతాలు బయట పడుతున్నాయని అన్నారు. దీంతో కేటీఆర్ డొంకంత కదులుతుందన్నారు. అవినీతి గోడలు ఎక్కడ బద్దలు అవుతుందో అని కేటీఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. హైడ్రాతో అక్రమ భవనాలను కూల్చుతుంటే పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణం అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కౌన్సిలర్లు కుడిక్యాల రవికుమార్, నేరెళ్ళ శైలు, వేముల రవి, రెడ్యానాయక్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి

- ఎస్సై సుధాకర్



మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి, ఆగస్టు 24: బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలని ఎస్సై సుధాకర్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు మండెపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ శాఖ, సఖి కేంద్రం ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలపై ఎలాంటి నేరాలు జరిగినా పోలీస్ శాఖ తక్షణం స్పందిస్తుందని అన్నారు. బాలబాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన ఉంటే లైంగిక నేరాలు పోలీసులు దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. బాలికలపై లైంగిక నేరాల నిరోదం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, లైంగిక నేరాలు జరిగితే వెంటనే కుటుంబసభ్యులకు గానీ, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సఖి కోఆర్డినేటర్ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌నారాయణ, పోలీస్ సిబ్బంది సంపత్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

● **మొబైల్ ఫోన్ అప్పగింత**

తంగళ్లపల్లి మండలం రామన్నపల్లె గ్రామానికి చెందిన కొయ్యడ సంధ్య మొబైల్ ఫోన్‌ను పోగోట్టుకోగా తంగళ్లపల్లి పోలీసులు సీఈఐఆర్ మొబైల్ అప్లికేషన్ సహాయంలో పోగోట్టుకున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించి నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోగోట్టుకున్న ఫోన్‌ను అందించిన పోలీసులకు సంధ్య కృతజ్ఞతలు తెలిపారు.

వేములవాడ ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు

వేములవాడ టౌన్, ఆగస్టు 24: వేములవాడ ఆర్టీసీలో నాణ్యమైన సేవలు అందిస్తున్న పలువురు ఉద్యోగులకు శనివారం అవార్డులను అందజేశారు. రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం హైద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా వేములవాడ ఆర్టీసీకి చెందిన ముగ్గురు ఉద్యోగులు అవార్డులు అందుకున్నారు. ఆర్టీసీ డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సత్యనారాయ ణ ప్రగతి చక్రం అవార్డుకు ఎంపికకాగా, కండక్టర్ ప్రమీల, నరసింహులు రాష్ట్ర స్థాయి ఉత్తమ కండెక్టర్ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనర్ శాలువతో సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు.



పగతి చక్ర అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ